COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం: తేది : 29.10.2015
ప్రెస్‌కాన్ఫరెన్స్ విజయవాడ

**బలవంతపు భూసేకరణ ఆపాలి.**
**ధనికుల ఇళ్లు రెగ్యులరైజ్ చేసి పేదల ఇళ్లు పీకేస్తారా**
**ప్రతిఘటన తప్పదన్న పి. మధు**

పూలింగ్‌కు నిరాకరించిన రైతుల భూములను భూ సేకరణ-2013 చట్టం ద్వారా తీసుకుంటామని ప్రభుత్వం బెదిరిస్తున్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు విమర్శించారు. తుళ్లూరులో 300ఎకరాలకు వారం రోజుల్లో భూ సేకరణకు నోటీసు ఇస్తామని వ్యవసాయ శాఖమంత్రి పుల్లారావు బెదిరించారని మధు అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావుతో కలిసి రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను బెదిరిస్తోందని, దౌర్జన్యంగా వారి భూములు తీసుకుంటుందనే ధోరణి మంత్రి మాటల్లో స్పష్టంగా కనపడుతుందని తెలిపారు. ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో భూములను తీసుకొనేందుకు గతంలో నోటిఫికేషన్ జారీ చేసి ప్రభుత్వం వెనక్కు తగ్గిందని, ఇప్పుడు రాజధాని శంకుస్థాపన తర్వాత భూ సేకరణ ద్వారా సేకరిస్తామని బెదిరిస్తుందని, ఈ బెదిరింపులు మంచిది కాదని హెచ్చరించారు. అవసరానికి మించిన భూములను బలవంతంగా సేకరించడం, భూ బ్యాంక్‌ల పేరుతో సేకరించడం వంటి దౌర్జన్యాలను ప్రభుత్వం ఆపకపోతే తమతో కలిసొచ్చే వారిని కలుపుకొని ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. భూ సమీకరణ ద్వారా రాజధాని ప్రాంతంలో 2,100ఎకరాల లంక భూములను తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పినట్లు పత్రికల్లో వచ్చిందని చెప్పారు. 29 గ్రామాల్లో అసైన్డ్ భూములకు కూడా ఈ ప్యాకేజినే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాకాని యెడల ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రాష్ట్రంలో 10లక్షల ఎకరాల భూములను సేకరిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని, అందులో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఉన్న లక్ష ఎకరాల ఫారెస్టు భూములు కూడా ఉన్నాయని చెప్పారు. ఈ భూములను తీసుకుని పర్యావరణానికి విఘాతం కల్పించొద్దని సూచించారు. అనివార్యమయితే ఈ భూములు సాగుచేసుకుంటున్న రైతులకు కూడా రాజధాని భూములకు ప్రకటించిన ప్యాకేజి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా ఎన్‌పి కుంట మండలం కేంద్రం చుట్టూ 10,500ఎకరాలను, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం శకునాల గ్రామంలో 2,200 ఎకరాలను, ఈ గ్రామం పక్కన మరో 2,500ఎకరాలను సోలార్ పవర్ ప్లాంట్‌ల కోసం ప్రభుత్వం సేకరించిందని వివరించారు. ఈ మూడు చోట్ల కూడా రైతులకు నష్టపరిహారం చెల్లించకుండానే కాంట్రాక్టర్లకు అప్పగించారని, ఇది 2013భూ సేకరణ చట్టానికి పూర్తిగా విరుద్ధమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరిని మార్చుకోవాలని హెచ్చరించారు. నిరసన కార్యక్రమాలను పోలీసుల ద్వారా అణిచి వేసే వైఖరి రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతంలో కృష్ణ నదికి కరకట్టలోపల ఉన్న అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరిస్తామని చెబుతున్న ప్రభుత్వం కరకట్ట పక్కన్న ఉన్న 15వేల పేదల ఇళ్లను తొలగిస్తామని నోటీసులు ఇవ్వడం అన్యాయమన్నారు. ఈ ఇళ్లను పీకడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, అన్ని సంఘాలు, పక్షాలు కలిసి దుర్మార్గాన్ని ఎదుర్కొంటాయని ప్రకటించారు. ఇప్పటికే భవానిపురంలో ఉన్న వెయ్యి ఇళ్లను తొలగిస్తామని నోటిఫికేషన్ ఇచ్చారని చెప్పారు. ఈ ద్వంద విధానాన్ని అనుమతించబోమని, పేదవారి ఇళ్లకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

**(ఆర్. లక్ష్మయ్య)**
ఆఫీసు కార్యదర్శి